టీడీపీ నాయకులపై దాడులు నియంత్రించండి

విశాలాంధ్ర-గుంటూరు : టీడీపీ నాయకులపై అధికార పార్టీ నాయకుల దాడులను నియంత్రించాలని, ఎన్నికలు సజావుగా సాగేలా నియమ నిబంధనలు అమలు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడికి టీడీపీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజ నేయులు తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు.

టైలర్ షేక్ హసునుద్దీన్‌ను కలిసిన అంబటి

విశాలాంధ్ర-పొన్నూరు : ఎలాంటి వారినైనా తన కళా నైపుణ్యంతో మాయ చేసి మరింత అందంగా చేసే సనాతన ఫ్యాషన్ డిజైనర్లు టైలర్లు అని నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ తెలి పారు. గురువారం మెన్స్ టచ్ టైలర్ మాస్టర్ షేక్ హసునుద్దీన్ డిజైనర్‌ను ఆయన మర్యాదపూర్వ కంగా కలిశారు. తదుపరి ఆయన మాట్లాడుతూ సూది మొనపై నర్తించే దర్జీల జీవితాలు చిక్కులుపడ్డ దారాన్ని సైతం సరిచేసి వస్త్రాన్ని అందంగా మలచి నాగరికుడిలా చేస్తున్నారని తెలిపారు.

వైసీపీ 20వ వార్డు మెంబర్ టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని మండలం పెదకాకాని గ్రామం ముస్లిం పాలెంకు చెందిన 20వ వార్డు వైసీపీ మెంబర్ షేక్ బాజి గురు వారం చింతలపూడి గ్రామంలో పొన్నూరు నియోజకవర్గ తెలుగు దేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షేక్ బాజీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపుకు శక్తివంచన లేకుండా పనిచేసి భారీ మెజార్టీతో గెలిచే విధంగా తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు. జిల్లా పార్టీ మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ శిలార్ సాహెబ్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలను సందర్శించిన కేంద్ర బృందం

విశాలాంధ్ర-పెదకాకాని : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డిజిటల్ విద్యా విధానం అమలు తీరును, పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ నిపుణుల పని తీరును పరిశీలించేందుకు గుంటూరు జిల్లాలోని పెదకా కాని మండలం వెనిగండ్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం తనిఖీ చేసింది. ఈ బృందంతో పాటు ప్రభుత్వ విద్యాశాఖ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, పెదకాకాని మండల విద్యాధికారులు బలి రామ్ నాయక్, శంకర్ రాజు ఉన్నారు. పాఠశాల సందర్శ నానంతరం కేంద్ర బృందం పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది.

కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలం మాచవరం గ్రామం తుంగభద్ర డ్రెయిన్ కట్టపై గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్సై బండ్ల భార్గవ్ ఆధ్వర్యంలో కోడి పందాలు స్థావరాలపై దాడులు చేశారు. 14 మందితో పాటు రూ.33 వేలు నగదు, 6 కోడిపుంజు లతో పాటు 16 కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్సై భార్గవ్ మీడియాకు తెలిపారు.

విజ్ఞాన్స్ వర్సిటీ - ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్‌ల మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీ - ఢిల్లీలోని ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్‌తో అవగాహన పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యూనివర్సిటీ అథ్లెట్లకు ఒక ప్రత్యేక వేదికను కల్పిస్తుందన్నారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఇ-స్పోర్ట్స్, కబడ్డీ అనే నాలుగు లీగ్‌లు ఉంటాయని, ఒక్కో జట్టు లీగ్‌లో 5-6 మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుందన్నారు. వీటి వలన అథ్లెట్లకు ప్లాట్‌ఫారమ్ అందించడంతో పాటు వారి ఖర్చులన్నీ ఎలైట్ పవర్ స్పోర్ట్స్ భరిస్తుందని చెప్పారు.. ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్ మాట్లా డుతూ యువతను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. అగ్రశ్రేణి ప్రతిభను రిక్రూట్ చేయ దానికి ఈ అవగాహన ఒప్పందం ఒక వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

రామాంజనేయులు గెలుపు ఖాయమనే దాడులు

విశాలాంధ్ర-గుంటూరు : ఒక ఐఏఎస్ అధికారి, విద్యావంతుడు బూర్ల రామాంజనేయులు గెలుపు ఖాయమైందని తెలుసుకున్న కిరణ్ కుమార్ తప్పుడుదారులు ఎంచుకున్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్ అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రత్తి పాడు టీడీపీ శాసనసభ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై వైసీపీ రౌడీ మూకలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. వైసీపీ శాసన సభ అభ్యర్థి కిరణ్ కుమార్ వలంటీర్లను తమ కార్యాలయానికి పిలిపించుకొని ఎన్నికల నియమావళిని కాలరాసి వలంటీర్లకు ప్రచార బాధ్యతలు అప్పగిస్తూ వారికి బహుమానాలు ఇస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడన్నారు. కార్యక్రమంలో బొల్లెద్దుల సుశీలరావు, గుడిమెట్ల దయా రత్నం, యనమల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డరోడ్డులో నగదు పట్టివేత

విశాలాంధ్ర-తాడికొండ : స్థానిక అడ్డరోడ్ సెంటర్‌లోని చెక్‌పోస్ట్ వద్ద గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బడేపురం గ్రామానికి చెందిన మొగిలి అశోక్ వద్ద ఉన్న రూ.78,260లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరులో పెయింట్లు కొనుగోలు చేసేందుకు తన వ్యక్తిగత నగదును తీసుకువెళుతున్నట్లు అశోక్ బదులిచ్చారు.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా తెలయజేయునది ఏమనగా ది.23-03-2024 శనివారం మ॥ 3 గం॥లకు మంగళగిరి బ్రాంచి నందు 368.00గ్రాములు కుదువ పెట్టిన పాత బంగారు నగలు మా మంగళగిరి బ్రాంచ్ ఆఫీస్ నందు వేలం వేయబడుచున్నవి. వేలం వేయబడుచున్న నగలు వినియోగదారుల సమయం దాటిపోయినందున, వారందరికీ మా వేలం పాట ప్రకటనలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగినది. వేలం పాటలో పాల్గొనే వ్యక్తి తమ అడ్రస్ ప్రూఫ్ & ఐ.డి.ప్రూఫ్ వెంటతీసుకుని రావలెను. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి వుంటుంది. నిబంధనల కొరకు దయచేసి మా ఆఫీసు నందు సంప్రదించగలరు.

అరుణా ఫైనాన్స్ లిమిటెడ్
డోర్ నెం. 07-547, గుంటూరు రోడ్డు,
మంగళగిరి-522503, గుంటూరు జిల్లా.
సెల్: 88851 22355

FEDBANK
FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: కనాకియా వాల్‌స్ట్రీట్, ఎ-వింగ్, 5వ అంతస్తు, యూనిట్ నం.501, 502, 511, 512, అంధేరి-కుర్లా రోడ్, చకాల, అంధేరి ఈస్ట్, ముంబై, మహారాష్ట్ర-400093

సవరణ

ఈ వార్తాపత్రిక అనగా విశాలాంధ్ర గుంటూరు ఎడిషన్‌లో 21-03-2024న ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ప్రచురించబడిన ఎం/ఎస్. ఖాదర్ డెయిర్‌ఫామ్‌కు యజమానిగా ప్రాతినిధ్యం వహిస్తున్న రుణఖాతా సంఖ్య: FEDVIJSTL0508933, షేక్ ఖాదర్ మస్తాన్ (రుణగ్రహీత) యొక్క స్వాధీనత ప్రకటనలో స్థిరాస్తి స్వాధీనత తేదీని 29.08.2023కి బదులుగా **19.03.2024** గా చదువుకొనవలెను. నోటీసులోని ఇతర అంశాలలో ఎటువంటి మార్పులేదు.

సం/- అధీకృత అధికారి

అనుమానాస్పద లావాదేవీల ఖాతాల వివరాలు అందించాలి

- కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో భాగంగా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల ఖాతాల వివరాలు ఎప్పటికప్పుడు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి లోక్ సభ అభ్యర్థి రూ.95 లక్షలు, శాసన సభ అభ్యర్థి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అనుమతి ఉంటుందన్నారు. అయితే అంతకు మించి జరిగే వ్యయంపై పటిష్టమైన నిఘా ఉంటుం దని, ఈ విషయంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థుల బ్యాంకు ఖాతాల నుండి జరిగే లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు ఐ.టి. శాఖతో పాటు జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. అసాధరణంగా, అనుమానస్పద బ్యాంకు ఖాతాల నుంచి రూ. లక్ష నగదుకు మించి ఉపసంహరణలు, డిపాజిట్ల లావాదేవీలు జరిగితే వివరాలను అందించాలన్నారు. ఒకే బ్యాంకు ఖాతా నుంచి ఒక నియోజకవర్గం లేదా జిల్లాలోని వేర్వేరు బ్యాంకు ఖాతాలకు ఆర్టీజీఎస్ ద్వారా నగదు జమలు అవుతుంటే వివరాలు అందించాలన్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తదుపరి అభ్యర్థులు, వారి సంబంధీకులు లేదా రాజకీయ పార్టీల బ్యాంకు అకౌంట్ల నుంచి లక్ష రూపాయలకు మించి జరిపే లావాదేవీల వివరాలను కూడా అందజేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఆదాయపు పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలితా, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్ జవహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో తమ వ్యాపారాలు చేసుకోవాలి

- నాదెండ్లమనోహర్

విశాలాంధ్ర-తెనాలి : తెనాలిలో వ్యాపారస్తులు పూర్తి ఆత్మవిశ్వాసంతో ప్రశాంతమైన వాతావరణంలో తమ వ్యాపార కార్యకలాపాలు సాగించుకోవాలని అందుకు తమ సహకారం ఉంటుందని జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం గంగానమ్మపేటలో ది తెనాలి వెండి, బంగారం నగల వర్తకుల సంఘం భవనంలో ఆత్మీయ సమావేశం కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. పెదరావూరు, మంగళగిరి 4 రోడ్ల నిర్మాణం టౌన్‌లో రింగ్ రోడ్డు పూర్తి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో బొంబాయిలోని కుర్లా మోడల్‌లో ఫుట్‌బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాద నలతో తెనాలి ప్రజలకు 50,60 ఏళ్ళ భవిష్యత్తు దృష్టితో అభివృద్ధి ఆలోచనలతో ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ గంట గడిస్తే చాలన్న రీతిలో 4లైన్ల రోడ్లపై విగ్రహాలను పెట్టి అవరోధాలను సృష్టిస్తున్నారని, ఏది అభివృద్ధి-ఏది అవరోధమో ప్రజలు గ్రహించాలని అన్నారు. అభివృద్ధి పేరుతో విధించిన పన్నుపై నియంత్రణ ఉంటుందని, తాము వచ్చిన వెంటనే చెత్తపన్నుం డదని, వ్యాపారస్తుల సమస్యలపై తన దృష్టికి వస్తే తాను సత్వరమే స్పందిస్తానని చెప్పారు. సమావేశంలో జౌన సంఘ నాయకులు, వ్యాపారస్తులు, తాడి బోయిన బ్రహ్మయ్య, కొత్తమాసు ఆంజనేయులు, వెల్లంపల్లి సత్యనారాయణ, కోగంటి శంకరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు లేక పరిశ్రమలు కుదేలు

విశాలాంధ్ర-తెనాలి: నాయకుడిని బట్టి ప్రజలు, పరిశ్రమలను బట్టి కార్మికుల జీవితాలు ఆధారపడి ఉంటాయని, ఒక కార్మికుడి కష్టం ఒక వ్యవస్థను నిలబెడుతుందని టీడీపీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తెనాలిలోని కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ పరిశ్రమను ఆయన గురువారం పరిశీలించారు. అక్కడి కార్మికులతో మమేకమై కాసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికే ఆ కష్టం విలువ తెలుస్తుందని, కార్మికులు గాని కార్యకర్తలు గాని బాగున్నప్పుడే వ్యవస్థలు సజావుగా నడుస్తాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు ప్రోత్సాహకాలు లేక కుదేలవుతున్నాయని, మరికొన్ని పరిశ్రమలు రాష్ట్రం వదిలి వెళ్ళిపోతున్నాయని ఆయన వివరించారు. తర్వాత సంస్థ అధినేత కొత్తా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్రలో ప్రస్తుత పరిస్థితి లాంటి ఇబ్బందులు ఎప్పుడూ ఎదురుకాలేదని తెలిపారు. ప్రతిఒక్కరు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అందరిని కోరారు.

మంగళగిరికి ఆర్కే ఏం చేశారో చెప్పాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: రాజధాని ఇక్కడే ఉంటుందని మంగళగిరి ప్రజలను మోసం చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి ఆళ్ళ రామకృష్ణారెడ్డి అని టిడిపి, జనసేన, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి టీడీపీ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళగిరిలో లక్ష వేల ఓట్లు మెజార్టీతో నారా లోకేష్ గెలుపు ఖాయమన్నారు. నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉండి మంగళగిరిలో 29 సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ఆర్కే నారా లోకేష్ పై చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మంగళగిరి అభి వృద్ధిపై చర్చకు సిద్ధమా అని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి మంగళగిరి, తాడేపల్లికి ఏం చేసారో వైసీపీ నాయకులు చెప్పా లని డిమాండ్ చేశారు. నారా లోకేష్ పేద, బడుగు వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. మూడు రాజధాను లను పేరు చెప్పి రాష్ట్రాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని అన్నారు. టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కొల్లి శేషు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, మేకా శ్రీధర్ రెడ్డి, జ్యోతి బసు, జనసేన పార్టీ నాయకురాలు బడే కోమలి, పసుపు లేటి అశోక్, మేకల రాజా పాల్గొన్నారు.

అధికార, ప్రతిపక్షాల అసమర్థ విధానాలే అభివృద్ధికి ఆటంకాలు

విశాలాంధ్ర-గుంటూరు : అధికార, ప్రతిపక్షాల అసమర్థ విధానాల వల్లే అభివృద్ధి కుంటుపడిందని ఏపీఆర్ఎస్ పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అల్తాఫ్ మండిపడ్డారు. గురువారం ఉదయం ఆయన స్థానిక హుస్సేన్ నగర్, చంద్రబాబు నాయుడు కాలనీ, పొన్నూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో అనేక శివారు ప్రాంతాల్లో ఇటీవల ప్రారంభించిన రోడ్లు, సైడు కాలువలు ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయాయని, దానివల్ల స్థానికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని అల్తాఫ్ దృష్టికి తీసుకువచ్చారు. సరైన ప్రతిపక్షం లేనందువల్లే అధికార పార్టీ ఇష్టానుసారం వ్యవహరించిందని, అందువల్లే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పలు సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలి

- జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు ఆదేశించిన డీఎంహెచ్‌ఓ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్‌ఓ)సమావేశ హాల్ నందు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయ లక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య ఆసరాపై వైద్యాధికారులు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో కాన్పులు అయిన మహిళలందరికీ ఆరోగ్య ఆసరా క్రింద రూ.5వేలు పొందేందుకు అర్హులైన వారి వద్ద నుంచి డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డు బ్యాంక్ ఎకౌంట్‌కు లింక్ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి లక్ష్మీ కుమారి, అకౌం టెంట్ అధికారి కృష్ణ కుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ విజయ ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా దేవాన్ష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : నారా చంద్రబాబు, నందమూరి బాలకృష్ణ మనవడు, నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ జన్మదిన వేడుకలు మంగళగిరి పట్టణంలోని డాక్టర్ ఆంజనేయ కాలనీలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వార్డు ప్రజలు, విద్యార్థులు సమక్షంలో దేవాన్ష్ జన్మదిన కేక్ కట్ చేశారు. గోవాడ దుర్గారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చంద్రబాబు కుటుంబం తిరుమల తిరుపతి దేవస్థానంలో రూ.38 లక్షలతో నిత్య అన్నదానంలో ఒకరోజు అన్నదానం నిర్వహిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో నారా లోకేష్ అత్యధిక మెజార్టీతో గెలవబోతు న్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, గుంటూరు పార్లమెంటరీ పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ, 6, 9 వార్డుల నాయకులు జొన్నాదుల వెంకట రామాంజనేయులు, పాల్గొన్నారు.

విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని మెకానికల్ విభాగం వారు యాంత్రిక 2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండల చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిం చారు. మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో రాణించాలని ఆకాంక్షించే విద్యార్థులు ఆ దిశగా పరిశోధనలు చేయాలన్నారు.అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల యొక్క డిమాండ్లపై ఇంజనీర్లు ప్రధాన విభాగాలలో బలమైన పునాదిని కలిగి ఉండవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఉత్పాదక రంగంలో మారుతున్న డైనమిక్స్‌కు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్ధ సారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్‌బీ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, సునీత తదితరులు పాల్గొన్నారు.

నసీర్‌కే సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరంలోని ముస్లిం దూదేకుల సంపూర్ణ మద్దతు టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్‌కేనని ముస్లిం దూదేకుల కులస్తులు, నూర్ బాషా సంఘం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్, టీడీపీ రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి కేఎం హుస్సేన్ అన్నారు. ఈ మేరకు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్‌ను వారు ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం కలిశారు. నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో దూదేకులకు అందిన సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. జగన్ రెడ్డి బీసీలను ఏ విధంగా మోసం చేశాడో వివరించాలని, ముఖ్యంగా బీసీల కోసం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్‌ను, బీసీల ప్రత్యేక చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగూర్, ఆదాం షఫీ, ఖాసీం వలి, సలాం, నబి, మీరా వలి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పుట్టిన రోజు వేడుకలు గుంటూరు పట్టణంలోని పలుచోట్ల వైభవంగా నిర్వహించారు. స్థానిక బ్రాడీపేటలో ఉన్న సాయిబాబా టెంపుల్ నందు 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి)ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ ఆచారి మాట్లాడుతూ మంచి మనస్సున రాజకీయ నాయ కుడు మద్దాళి గిరిధర్ అని అన్నారు. ఇటువంటి రాజకీయ నాయకుడు భవిష్యత్ కాలంలో రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాధ్, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఆలా కిరణ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ 20వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : విద్యార్థులు ఉత్తమ క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి కోరారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కుల, వర్గ విబక్షలకు తావు లేకుండా జీవితంలో ఉన్నత ఉద్యోగాలను సాధించి తోటి వారికి సాయపడినప్పుడే వారి విద్యకు నిజమైన అర్థం ఉంటుందని అన్నారు. ముందుగా ఈ వార్షికోత్సవ వేడుకలకు నిర్మల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల్ రెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ తరగతులలో టాపర్లుగా నిలిచి నటువంటి విద్యార్థులకు బంగారు పతకం, ప్రశంసా పత్రము వివిధ కార్యక్రమాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న పి.శశాంక్ ఉత్తమ విద్యార్థి, కె.నిహారికలకు ఉత్తమ విద్యార్థిని అవార్డులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ యు.శౌరీలు, సిస్టర్ పి.అల్ఫోన్సా, ఫాదర్ యు కిరణ్ కుమార్, సిస్టర్ జాన్ పాల్, సిస్టర్ కె సుందరి, సిస్టర్ జి నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

విశాలాంధ్ర-పొన్నూరు : వైసీపీ నాయకులు 4 సంవత్సరాల 10 నెలలు నిద్రపోయి అభివృద్ధిని విస్మరించి ఎన్నికల కోడ్ రాగానే అభివృద్ధిపై హడావుడి చేస్తున్నారని పట్టణ టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లా డారు. ఎన్నికల కోడ్ మార్చి 16న వస్తే వార్డులలో పనుల కోసం మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌పై వత్తిడి చేయడం జరిగిందన్నారు. మార్చి 14న కౌన్సిల్ తీర్మానం చేసినట్లు అదే రోజు వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు మా నోటీసులో ఉందన్నారు. 16వ తేదీ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత హడావుడిగా వైసీపీ నాయకులు ఒత్తిడి మేరకు మున్సిపల్ అధికారులు పనులు మొదలుపెట్టడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారులు పనులను నిలుపుదల చేస్తే అదేదో తెలుగుదేశం పార్టీ వారు ఆపించారని విషప్రచారం చేయటం దారుణమన్నారు.ప్రజలు వైసీపీ నాయకుల మాటలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆకుల సాంబశివరావు, లక్ష్మీనారాయణ చౌదరి, బాజీ సాహెబ్, తోట ప్రసాద్, సిలార్ భాష పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్ల అభివృద్ధి అంశాలపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎంటీఎంసీ కమీషనర్ వి.నిర్మల్ కుమార్, అధ్యక్షతన డిప్యూటి కమీషనర్.బి శివారెడ్డి రెవిన్యూ విభాగమునకు సంబంధించిన ఇంటి పన్ను వసూళ్ల అభివృద్ధి, ఇతర అంశములపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో చర్చించి ప్రతి ఒక్కరి సచివాలయ పరిధిలో టాక్స్ కలెక్షన వివరములు, వసూలు, బకాయిలు చెల్లింపుల విషయములను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు టాక్స్ కలెక్షన్‌కు తప్పనిసరిగా వార్డులకు వెళ్లి సామరస్యంగా యజమానులతో మాట్లాడి టాక్స్ కలెక్షన్ ఇంప్రూవ్ చేయాలని కమిషనర్ సూచించారు. ఎక్కువ బకాయిలు ఉన్నవారిని టాక్స్ బకాయిలు తీర్చుటకు సిద్ధం చేయాలని స్లమ్ ఏరియాలలో మొండి బకాయిలు, దీర్ఘకాల బకాయిలను ప్రత్యేక దృష్టి పెట్టి వసూలు చేయాలని చెప్పారు.కార్యనిర్వహణలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారి దృష్టికి తీసుకువచ్చి వాటికి పరిష్కారం చేయుటకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ ఆఫీసర్, రెవిన్యూ సిబ్బంది, సచివాలయముల పంచాయతీ సెక్రటరీలు, అడ్మిన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్ కలలకు సోపానాలు స్నాతకోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తల్లిదండ్రులు తమ బిడ్డల బంగారు భవిష్యత్తు పట్టభద్రులుగా చూసుకునే తొలి మెట్టు బాలల స్నాతకోత్సవాలని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ మెడి, టెక్నో పాఠశాల ఎల్కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న బాల బాలికలు ఒకటవ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందున 25వ సిల్వర్ జూబ్లీ బాలల స్నాతకోత్సవం సందడిగా జరిపారు. పట్టభద్రుల వలే బ్లాక్ యాప్రాన్, క్యాప్ ధరింపజేసి పాస్ సర్టిఫికెట్లు అందజేశారు. కరస్పాండెంట్ చక్రనా నాగ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు లలిత, మాధవి, యశోద పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే మళ్ళీ జగన్ ప్రభుత్వం కావాలి

- 'ఇంటింటి ప్రచార కార్యక్రమంలో నూరి ఫాతిమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే మళ్ళీ జగనన్న ప్రభుత్వం రావాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసి మీ అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుకే వేయాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 3వ డివిజన్ ప్రగతి నగర్‌లో ఇంటి-ఇంటికి తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధి పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఇతర పార్టీలు కూటమిగా వచ్చినా జగన్‌రెడ్డిని టచ్ కూడా చేయలేరని ఆమె ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు అల్లం గోపి, మాదాసు మాధవ, స్వర్ణ, సాదం సురేష్, మాధవ చిన్న ఆనంద్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రెవిన్యూ వసూళ్ళ టార్గెట్ 28 నాటికే పూర్తి చేయాలి : అదనపు కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగర పాలక సంస్థ రెవిన్యూ ఇన్స్పెక్టర్లు మరియు రెవిన్యూ అధికారులకు కేటాయించిన టార్గెట్ 33 కోట్లు మర్చి 28 నాటికే పూర్తి చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమీషనర్ కె.రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. కమీషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు రెవిన్యూ వసూళ్ళ వేగవంతంపై గురువారం ఉదయం కమీషనర్ ఛాంబర్ నందు డిప్యూటీ కమీషనర్లతో కలిసి రెవిన్యూ అధికారులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుతగా 21వ తేది వరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ల వారీగా వసూళ్ళ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిప్యూటీ కమీషనర్లు చెరువు శ్రీనివాస్, వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

వైసీపీ ట్రాప్‌లో పడకండి

- చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో నాగబాబు

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ నాయకులు తాము ఓడిపోతున్నామనే నిర్ధారణకు వచ్చేశారు.. అందుకే రకరకాల కుయుక్తులతో జన సైనికులను, వీర మహిళలను, జనసేన శ్రేణులను గందరగోళపరచే కుట్రలు చేస్తున్నారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు స్పష్టం చేశారు. జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు ఎవరూ వైసీపీ ట్రాప్‌లో పడవద్దని సూచించారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో నాగబాబు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తిరుపతి నియోజకవర్గంలో జనసేన పార్టీని గెలిపించుకునేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసిన, పార్టీ కోసం నిలబడిన ప్రతిఒక్కరికి ఉమ్మడి ప్రభుత్వంలో సముచిత గౌరవం దక్కే విధంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అవకాశం కల్పిస్తారని అన్నారు. జనసేన పార్టీ వైసీపీ లాంటిది కాదని, జనసేన పూర్తి ప్రజాస్వామ్య విధానాలతో పనిచేస్తోన్న పార్టీ అని పునరుద్ఘాటించారు. జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్న ప్రతి నియోజకవర్గంలో కుట్రలు చేసి నెగ్గాలనే దుర్బుద్ధితో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్, డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, ఏవీ రత్నం, కిరణ్ రాయల్, జె.రాజా రెడ్డి, పంచకర్ల సందీప్, కీర్తన, సుభాషిణి, వనజ, శ్యామల, రాజేష్ యాదవ్, మధు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర-తెనాలి : ఎన్నికలకు సంబంధించి 16వ తేదీన షెడ్యూలు విడుదల చేసిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున 91-తెనాలి నియోజకవర్గ పరిధిలో రాజకీయన పార్టీలు ఎటువంటి ర్యాలీలు, బహిరంగ సభలు, ఇంటింటికి ఎన్నికల ప్రచారం, కాన్వాసింగ్ కొరకు వాహనాలను వినియోగించవలెనన్న రిటర్నింగ్ అధికారి, తెనాలి వారి నుండి అనుమతి తీసుకోవాలని సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. ఎలక్షన్ కమీషన్ వారి సువిధ యాప్ ద్వారా ఆన్లైన్ నందు కాని, మాన్యువల్‌గా అయితే సబ్‌కలెక్టర్, తెనాలి వారి కార్యాలయం నందు కాని దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న సమయం నుండి 48 గంటలలోపు అనుమతులు మంజూరు చేయబడునని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోబడునని అన్నారు. తెనాలి నియోజకవర్గంలో ఎటువంటి ఫిర్యాదులైన వున్న యెడల టోల్‌ఫ్రీ నెం.08644-232475కు తెలుపగలరు.

వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఖాజావలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విశాఖపట్నంలోని రిషికొండ ఫామ్ హౌస్‌లో రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని ముస్లిం హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్)రాష్ట్ర అధ్యక్షులు షేక్.ఖాజా వలి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. షేక్. ఖాజావలి వైవీ సుబ్బా రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుని మరొకసారి ముస్లీంల మనోభావాలను దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ముస్లింలు, మైనార్టీ సంఘాలు వైసీపీని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీని గెలిపించడానికి కృషి చేయాలని ఖాజావలిని తెలిపారు. వైసీపీ మైనార్టీ సంక్షేమానికి ఎంతగానో కృషి చేసిందని, రాజకీయంగా మైనార్టీలకు ఎంతగానో ప్రాధాన్యత ఇచ్చినట్లు వైవి సుబ్బారెడ్డి అన్నారు. అంజాద్ బాషాకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి నలుగురు ముస్లింలను శాసనమండలి సభ్యులుగా పదవులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈసారి ఎన్నికలలో ఏడు స్థానాలను ముస్లింలకు కేటాయించినట్లు తెలిపారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి మాట్లాడుతూ త్వరలో తమ కమిటీ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆంధ్ర తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ రఫీ, విశాఖపట్నం ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు షేక్ సుకూర్ పాల్గొన్నారు.

రామచంద్రపురం సీటు జనసేనకు కేటాయించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్దకు కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు గురువారం ఆందోళన చేపట్టారు. తమ నియోజకవర్గంలో జనసేన పార్టీ బలంగా ఉందని ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న పోలిశెట్టి చంద్రశేఖర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని, కొద్దిరోజులుగా అమలాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌ను రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సీటు కేటాయిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రామచంద్రాపురం నియోజకవర్గ సీటును జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్‌కు కేటాయించాలని లేనిపక్షంలో నాగబాబును తమ నియోజక వర్గంలో నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. రామచంద్రాపురం నియోజక వర్గంలో జనసేన పార్టీ బలంగా ఉందని, అసెంబ్లీ సీటును జనసేన పార్టీకి కేటాయించినట్లయితే గెలుస్తామన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వాలంటీర్లు ప్రభుత్వ సమాచారం చేరవేస్తే చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర-సత్తెనపల్లి: సత్తెనపల్లి మునిసిపల్ పరిధిలోని వాలంటీర్స్‌కి అధికారుల సమాచారం కోసం ఏర్పాటు చేసిన అన్ని వాట్సప్ గ్రూప్‌లను ఎన్నికల కోడ్ దృష్ట్యా రిమూవ్ చేయడమైనదని మునిసిపల్ కమిషనర్ షమ్మీ అన్నారు. గురువారం అయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన గ్రూప్ నేమ్స్, ప్రభుత్వానికి సంబంధించిన నాయకుల పోటోలు కానీ, డీపీలుగా గ్రూప్లో ఏం పెట్టరాదని ఇప్పటికే వాలంటీర్‌లకు సమాచారం అందించామన్నారు. ప్రభుత్వ సమచారం పెట్టరాదని ప్రతి ఒక్క వాలంటీర్‌కి తెలియచేశామని, ఒకవేళ ఏదన్నా వ్యతిరేకంగా పెట్టినట్లు మా దృష్టికి వస్తే వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు ప్రకారం వారిపై చట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుం టామని మునిసిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో కొనకంచివారిపాలెం, గోగులపాడు, రామిరెడ్డి పాలెం, రొంపిచర్ల తదితర సమస్యాత్మక గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను గురువారం నరసరావుపేట డీఎస్పీ వి.యస్.ఎన్ వర్మ పరిశీలించారు. ఆయా గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలలో మౌళిక వసతులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. సమస్యాత్మక గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామని డీఎస్పీ వర్మ తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్రమాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ సీఐ మల్లికార్జున, ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు, పోలింగ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించేందుకు కృషి చేయండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి: రానున్న ఎన్నికల్లో అవినీతి జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించి, టీడీపీని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం తన కార్యాలయం వద్ద నూతన ఎస్టీ సెల్‌ను అయన ప్రకటించారు. ఈ సందర్భంగా రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు నియోజకవర్గం ఎస్టీ సెల్ కమిటీ సభ్యులందరికీ నియామక పత్రాలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో వివిధ హొదాలో ఉన్న రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, దళిత మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికి టీడీపీ మేనిఫెస్టో

ప్రచారంలో భాగంగా జీ.వి.ఆంజనేయులు తనయుడు హరీష్

విశాలాంధ్ర-వినుకొండ : టీడీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిఒక్కరూ సహకరిం చాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తనయుడు యువ నాయకుడు గోను గుంట్ల హరీష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని 32 వార్డు లో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయూబ్ ఖాన్ అధ్యక్షతన ఇంటింటి ప్రచారం నిర్వహించగా హరీష్ పాల్గొని బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీ ప్రతిపాదించిన సూపర్ సిక్స్ మ్యాని ఫెస్టో క్యాలెండరును ఇంటింటికి తిరిగి అందజేశారు. హరీష్ మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు సీఎం అయి తేనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయ న్నారు. మెరుగైన పారిశ్రామిక అభివృద్ధి చెంది రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని ప్రజలందరూ టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి వినుకొండ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి జీవి ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లావు శ్రీకృష్ణ దేవ రాయలను ప్రజలందరూ ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నిశ్శంకర శ్రీనివాస రావు, టీడీపీ నాయకులు సౌదా గర్ జానీ భాష, వాసిరెడ్డి హనుమంతరావు, తుమాటి కాశి, చికెన్‌బాబు, అప్పారావు పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

అంతర్జాతీయ అటవీ శాఖ దినోత్సవం

విశాలాంధ్ర - వినుకొండ : అంతర్జాతీయ అటవీ శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీమతి గంగినేని కళ్యాణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డిఎఫ్ఓ రామచంద్ర రావు విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ జీవన మనుగడకు చెట్లు ఎంతో ప్రాముఖ్యమైనది. సృష్టిలోని సకల జీవ చరాలు బ్రతకాలంటే గాలి అవసరం అని అటువంటి గాలి నిచ్చే చెట్లను మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెట్లు అడవి యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం వెల్లటూరు రోడ్డులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నటువంటి నగరవనాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ అధికారి సురేంద్ర బాబు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి. సురేంద్రబాబు మరియు అటవీ శాఖ సిబ్బంది కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి 'మహాశక్తి' వరాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: మహిళాభ్యున్నతితోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని నమ్మిన తెదేపా వారి సంక్షేమానికి మేనిఫెస్టోలో మహాశక్తి పేరిట వరాలు ప్రకటించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకురాలు పఠాన్ నూర్జహాన్ అన్నారు. పెదకూరపాడు మండలం కాశిపాడు గ్రామంలో గురువారం రాత్రి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులు శివరంజని, పద్మావతి, అరుణ, సౌజన్యలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో ఆడ బిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ గెలుపుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుం దని నూర్జహాన్ అన్నారు. సూపర్ సిక్స్ భవిష్యత్తు గ్యారంటీ కలలకు రెక్కలు, శంఖారావం పథకాల గురించి ఓటర్లకు గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు అందరూ అండగా నిలవాలని గ్రామస్తులను తెలుగు మహిళలు గంగినేని లీలావతి, ముంతాజ్, సరిపూడి కృష్ణకుమారి, పాటిబండ్ల శివమ్మ, కోంద్రు పద్మలత, కాపూరి సుజాత, నాదేండ్ల కల్పన, గుమ్మడి పుష్పలతలు కోరారు.

ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రతి రూపాయి లెక్కచెప్పాలి

– జిల్లా ఎన్నికల అధికారి

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లా కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధుల, ఎలక్షన్ నిధుల ఖర్చుల సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పోలీస్ అధికారి డి.శ్రీనివాస్ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి టి.పరంధామ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి ఐవీ రామకృష్ణ నాయక్, డీసీఓ నారాయణ స్వామి(సి విజిట్ అధికారి), ఖర్చుల నమోదు అధికారి (సేరి కల్చర్ ఆధికారి బాల సుబ్రమణ్యం) హాజరయ్యారు. సమావేశంలో శాసనసభ, పార్లమెంట్‌లకు పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు చేసే ప్రతిఒక్క రూపాయి లెక్కలు అప్పచెప్పాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం అధికారులను ఏర్పాటు చేశారు. వారు ఖర్చు చేసే ప్రతి రూపాయి అభ్యర్థులు నామినేషన్‌కు వచ్చే సమయంలో ఒక బుక్ ఇవ్వడం జరుగుతుందని, అందులో బ్యాంక్, క్యాష్, చెక్ బుక్ ద్వారా ఖర్చులు వ్రాయాల్సి ఉంటుందన్నారు. బుక్ మొదట, చివరి పేజీలలో ఇఆర్ఓ సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి ఎవరైనా తమకు సంబంధం ఉన్న ఏజెంటు ద్వారా లెక్కలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయాలన్ని రాజకీయ పతినిధులు తప్పనిసరిగా రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్లకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు తెలియకుండా ఎవరైనా సమావేశాలు, కార్లు, ర్యాలీలు ఇళ్ల మీద జెండాలు తదితర పెట్టినప్పటికి ఆ వివరాలు అభ్యర్థుల లెక్కలో లెక్కించాల్సి ఉంటుందని చెప్పారు. అసెంబ్లీ అభ్యర్థి అత్యధికంగా రూ.40 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, పార్లమెంట్ అభ్యర్థి రూ.95 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, వైసీపీ, సీపీఐ, బీఎస్పీ, బీజేపీ, ఏఐఎంఐఎం, వీసీకే తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గురజాల నియోజకవర్గంలో కానరాని ఎన్నికల హడావుడి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని గత కొన్ని నెలలుగా ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రజలు కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూశారు. ప్రతిపక్ష పార్టీలు ముందస్తు ఎన్నికలు ఇదిగో అదిగో అంటూ ఊహాగానాలతో ప్రచారం నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. పార్లమెంటుతో పాటుగా అసెంబ్లీకి కూడా ఒకేసారి ఎన్నికల నగారా మోగింది. నోటిఫికేషన్ ఏప్రిల్ 18 వెలువడనుండగా మే 13న పోలింగ్ జరగనుంది. నామినేషన్లకు 29 రోజులు పోలింగ్ జరగటానికి 53 రోజులు సమయం ఉంది. సమయం ఎక్కువగా ఉండటంతో రెండు ప్రధాన రాజకీయ పార్టీలు ఎంతో ధీమాగా ఉన్నాయి. గురజాల నియోజకవర్గంలో అధికార వైసీపీ అభ్యర్థిని ముందుగానే ప్రకటించగా ప్రచారంలో ముందున్నారు. టిడిపి తన అభ్యర్థిని మొదటి విడతలో ప్రకటించక పోవడంతో తెలుగు తమ్ముళ్ళు డీలా పడిపోయారు. రెండవ విడత తెలుగుదేశం జనసేన, బిజెపి, ఉమ్మడి అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావును ప్రకటించారు. అయితే నామినేషన్లకు 29రోజులు గడువు, పోలింగ్ జరగటానికి 53 రోజులు సమయం ఉండటంతో అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. ఇప్పటినుంచి ప్రచారం పర్వం మొదలు పెడితే ఖర్చు తడిసి మోపెడు అవుతుందని ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారు. పార్టీలోని అసమ్మతి నాయకులను కలుస్తూ తమకు ఈసారి మద్దతు ఇవ్వవల సినదిగా కోరుతున్నారు. టి అంగుళ్ల వద్ద ప్రధాన కూడాళ్ళలో ఎన్నికల కార్యాల యాలు ఏర్పాటు చేయడం లేదా అని ప్రజలు ఆరా తీస్తున్నారు. అభ్యర్థులు మాత్రం పూర్తిస్థాయి ప్రచా రంపై దృష్టి ఇంకా పెట్టలేదు. బహుశా ఈ నెలాఖరు నుంచి పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కార్యాల యాలు ఏర్పాటు, ఎలక్షన్ల హడావుడి ఎప్పటినుండి మొదలవుతాయా అని నియోజక ఓటర్లు ఎదురు చూస్తున్నారు.

రైతుల సంక్షేమం కోసం కృషి : లావు

విశాలాంధ్ర-కారంపూడి: రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని టీడీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవ రాయలు అన్నారు. గురువారం మండలంలో ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతు నాగార్జునసాగర్ నుండి కుడి కాలువకు త్రాగునీరు, సాగునీరు వచ్చే పరిస్థితులు దిగజారుతున్నాయన్నారు. పల్నాడు ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలంటే గోదావరి, పెన్నా నదులను అనుసంధానించడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. 9లక్షల ఎకరాల భూములను కాపాడుకోవడానికి ఇదొక్కటే పరిష్కారమన్నారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ యిచ్చారు. కేంద్రనిధులతో ప్రతి యింటికి మంచినీటి కుళాయిని అందిస్తానన్నారు. ఎన్నికలకోడ్ వచ్చిన తరువాత కూడా కొంతమంది అధికారులు వైసిపి పార్టీకి అనుకూలంగా పని చేస్తున్నారని, అన్ని పార్టీలను ఒకే విధంగా చూడాలన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేవిధంగా పోలీసులు ప్రవర్తించవద్దని ఆయన హితవు పలికారు. ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట చిరుమామిళ్ల మధుబాబు, జనసేన కన్వీనర్ బూసా రామాంజనేయులు, కొంగర లక్ష్మీనారాయణ, వున్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్ పాల్గొన్నారు.

టీడీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర-అమరావతి : మండల కేంద్రమైన అమరావతి గ్రామానికి చెందిన పోలిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాపు కులానికి చెందిన 60 కుటుంబాలు పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీలోకి ఎవరు వస్తాన్నా కానీ ఎటువంటి భేదాలు లేకుండా ప్రతిఒక్కరిని సాదరంగా ఆహ్వానిస్తామన్నారు. టీడీపీ ఓట్ బ్యాంక్ పెంచుకునే అవకాశాలు చాలా ఉన్నాయని అన్నారు. టీడీపీ నాయకులు ప్రతిఒక్కరికి సూపర్ సిక్స్ ప్రయోజనాలు తెలియపరచి టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి లేకుండా నీచమైన రాజకీయాలు చేస్తూ రాక్షస అరాచక పాలన చేస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక, మైనింగ్ మొత్తం జగన్‌మోహన్ రెడ్డి అమ్ముతున్నాడని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

విశాలాంధ్ర-మాచర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఫారెస్ట్ ఇంచార్జ్ రేంజర్ అధికారి వెంకటరమణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణం లోని చెంచు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం అలవర్చుకోవాలన్నారు. మొక్కలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతా యన్నారు. అటవీ సంపదను కాపాడాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. పచ్చని పంట పొలాలు గలగల పారి సెలయేర్లు పచ్చని చెట్లు మనకు ప్రకృతి ఇచ్చిన సంప్రదాయాన్ని భావితరాలకు తెలిసేలా చేయాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెంటపాళ్ళలో టీడీపీ కార్యాలయం ప్రారంభించిన కన్నా

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాళ్ళ గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో అరాచక పాలనని తరిమికొట్టడానికి తెలుగుదేశం, జనసేన కూట మి సిద్ధమ వుతుందని, రాష్ట్రం మోయలేనంత అప్పులు చేశారని ఐదు సంవత్సరాల్లో చరిత్ర హీనుడిగా మిగిలిపోయాడని, సైకోని తరిమేద్దాం అనే స్లోగన్ తోటి ముప్పాళ్ళ మండల పార్టీ కార్యాలయం ప్రారంభం నుంచే ఎన్నికలకి సిద్ధమవుతున్నామని తెలిపారు. వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి : డీఎఫ్‌వో

విశాలాంధ్ర-వినుకొండ రూరల్: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గంగినేని కళ్యాణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమా నికి జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్ర రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డిఎఫ్ఓ రామచంద్రరావు విద్యార్థిని విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ జీవన మనుగడకు చెట్లు ఎంతో ప్రాముఖ్యమైనది. సృష్టిలోని సకల జీవ కోటి బ్రతకాలంటే గాలి అవసరం అని అటు వంటి గాలి నిచ్చే చెట్లను, పర్యావరణాన్ని మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు. చెట్లు, అడవి యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం వెల్లటూరు రోడ్డులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నటువంటి నగరవనాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ అధికారి సురేంద్ర బాబు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి. సురేంద్రబాబు, అటవీ శాఖ సిబ్బంది కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 15 కుటుంబాలు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-బొల్లాపల్లి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన నుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలగాలని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ తమ జీవితాలకు భద్రత కోరుకుంటు ప్రజలు టిడిపి-జనసేన-బిజెపి కూటమిని బలపరుస్తూ టీడీపీలో చేరుతున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. బొల్లాపల్లి మండలంలోని రెడ్డి పాలెం గ్రామంలో వైసీపీకి చెందిన 15 కుటుంబాలు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామా నికి వచ్చిన జీవీ ఆంజనేయులు సమక్షంలో కంద్ద కుంట సౌరి బాబు, ఉల్లిగడ్డల బాజి, దులాయి బాబు, ఆకాష్ కంద్రగట్ల, కంద్రగట్ల మరియబాబు, జక్క నాగరాజు, చేవూరి నాగ రాజుతో పాటు 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారందరికీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి సాధనంగా ఆహ్వానించారు. ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో ఒక ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయలేదని, రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశాడని అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక హామీలు గుప్పించి మోసం చేశాడని అన్నారు. గుండ్లకమ్మ నదిపై తంగిరాల డ్యాం నిర్మిస్తానని, ఎత్తిపోతల పథకాలు తెస్తానని, వరికపూడిశల ప్రాజెక్టు నిర్మించకపోతే నేను మీకు ముఖం చూపనని, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి వేయించి త్రాగునీరు సరఫరా చేయిస్తానని వాగ్దానాలు చేసి ప్రజలను దగా చేశాడని అన్నారు. ఎన్నికలకు ముందు వినుకొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని బ్రహ్మనాయుడుకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు జరపాల గోవింద నాయక్ సీనియర్ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

భవిత సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా ఫిజియో థెరఫీ సేవలు, చెవిటి, మూగ పిల్లలకు స్పీచ్ థెరఫీ సేవలు, డైలీ లివింగ్ యాక్టివిటీస్ వంటి సేవలను అందిస్తూ ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటు నందిస్తుందని ఎంఈవో మద్దిగుంట్ల సాంబ శివరావు అన్నారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే కార్యక్రమాన్ని స్థానిక భవిత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో 2 పుసులూరి లలిత కుమారి మాట్లాడుతూ ఈ సంవత్సరం నలుగురు భవితా విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. భవితా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎస్టీయూ మండల కార్యదర్శి బిళ్ళా రాజా రమేష్ ఆద్వర్యంలో భవితా విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఐఈఆర్టీ రిసోర్స్ పర్సన్ జగన్మోహన్ రెడ్డి, పార్వతి పాల్గొన్నారు.

రెండేళ్ళు దాటినా ఎలాంటి నిర్మాణాలు లేవు
ఎడారిగా మారిన ఎన్ఎస్‌పీ స్థలం

- ఇప్పుడు బాధిత కుటుంబాలు ఎక్కడ ఉన్నాయో తెలియని వైనం
- ఇక ఎన్నికల కోడ్ వచ్చింది
- రెండేళ్ళుగా గాంభీరాలు పలికి నేడు నోరెత్తని ఎమ్మెల్యే
- నివాసిత కుటుంబాలను బలవంతంగా కాళీ చేయించి క్వార్టర్స్ కూలకొట్టారు

ఎడారిగా మారిన ఎన్. ఎస్. పి. స్థలం

విశాలాంధ్ర - వినుకొండ : పటిష్టమైన వ్యాపార సముదాయాలు నిర్మిస్తాం, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తాం, చికెన్, మటన్ షాపులకు దుకాణాల నిర్మిస్తాం, చేపలమార్కెట్ ఏర్పాటు చేస్తాం, ముస్లింలకు షాదీ ఖానా నిర్మిసాం, వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తాం. ఇలా పలు ప్రజాప్రయోజన భవనాలు నిర్మిస్తామ ంటూ, స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలో సుమారు 22 ఎకరాల స్థలంలో వందలాది కుటుంబాలు నివ సిస్తూ కళకళలా డుతూ కాలనీ ఉండేది. అయితే రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే, అధికా రులచే బుల్డోజర్‌లు, యంత్రాలతో ఎన్ఎస్‌పీలోని క్వాటర్స్, భవనాలను నేలమట్టం చేశారు. కుటుంబాలు సామాన్లు సర్దుకునే సమయం కూడా లేకుండా యంత్రా లచే నివాస క్వార్టర్స్‌ను నేలమట్టం చేయగా ఆ కుటుంబా లన్నీ సామాన్లతో రోడ్లపై చేరారు. మీ అందరికీ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మిస్తామంటూ ఎమ్మెల్యే బాధిత కుటుం బాలకు కల్లబొల్లి మాటలు చెప్పారు. అయితే పట్టణానికి జగనన్న కాలనీ ఏడు కిలోమీటర్ల దూరం ఉండటంతో వారు కొందరు పోయేందుకు ఇష్టపడక. తలా ఒక దిక్కు చూసుకున్నారు. అయితే ఇంతవరకు ఆ ఎన్నెస్పీ కాలనీ లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఎడారిగా మారిపోయిందని బాధిత కుటుంబాలు ప్రజలు ఎమ్మెల్యే పై దుమ్మెత్తిపోస్తున్నారు. కాగా ఎన్ఎస్‌పీ కాలనీలో 400 షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తాము. గుడ్ విల్ పద్ధతిపై పలు నిర్మాణలు చేపట్టిస్తాము అని ఎంత ప్రచారం చేసినప్పటికీ గుడ్ విల్ పెద్ద మొత్తంలో ఉండటంతో వ్యాపార వర్గాలు అంతంత మాత్రంగానే వచ్చాయి. కాంట్రాక్టర్లు కూడా పెద్ద మొత్తం కమిషన్లకు భయపడి కొందరికి పాత బిల్లులు రాక కాంట్రాక్టర్లు కూడా ఎవరు ముందుకు రాలేదు. అలా నిలిచిపోయిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ రానే వచ్చేసింది. ఇక ఎమ్మెల్యే చేసేది ఏమీ లేక. రెండేళ్లుగా గాంభీరాలు పలికిన ఎమ్మెల్యే నేడు నోరు మెదపడం లేదు. కోట్లాది రూపాయల విలువైన ఎన్ఎస్‌పీ స్థలం నేడు ఎడారిగా మిగిలిపోయింది.

మాచర్లలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

విశాలాంధ్ర-మాచర్ల : పట్టణంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరించడంతో ప్రధాన కూడళ్ళయిన పార్కు సెంటర్, నెహ్రూనగర్, సాయి కృష్ణ రింగ్ రోడ్డు సెంటర్లు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. వేసవికాలం ప్రారంభం కావటం, మరోవైపు ఎన్నికలు దగ్గర పడటంతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీగా వాహనాల్లో పట్టణానికి రావడంతో ప్రధాన సెంటర్లన్ని రద్దీగా మారాయి. ద్విచక్ర వాహనాల రద్దీ పెరగటం, షాపుల ముందు సెల్లార్లు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైనే వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాఫిక్‌పై దృష్టి సారించి ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు.

నేడు గారపాడుకు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ రాక

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని గారపాడు గ్రామంలో ఈ నెల 22వ తేదీన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు మండల పరిషత్ కార్యాల యంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో అధికారులకు పోస్టల్ బ్యాలెట్స్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.శ్రీరాములు పోస్టల్ బ్యాలెట్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెదకూరపాడు, అమరావతి తహశీల్దార్లు జె.ప్రభాకరరావు, వెంకటరమణ, శిక్షకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం రాత్రి రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన జరిగింది. పట్టణంలోని జానపాడు రోడ్డు గేట్ నెంబర్ 64 వద్ద మాచర్ల పాసింజర్ రైలు ఢీకొనటంతో మహిళ అక్కడికక్కడికే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. చనిపోయిన మహిళ షేక్ హుస్సేన్ బి (58)అని, మతి స్థిమితం లేక రైలు పట్టాలపై తిరుగుతున్న సమయంలో పాసింజర్ రైలు ఢీకొట్టినట్లుగా తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని రైల్వేపోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా రంగయ్య

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ: పిడుగురాళ్ళ వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా పి.వి.రంగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి నుండి బదిలీపై పిడుగురాళ్ల వచ్చినట్లు తెలిపారు. గతంలో పిడుగురాళ్లలో వాణిజ్య పన్నులశాఖ అధికారిగా విధులు నిర్వహించిన పి.చందనహర్ష బదిలీపై కమిషనర్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. రంగయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టే అభ్యర్థులపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు డేగ కన్ను వేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలు పార్సెల్ సర్వీస్ సంస్థలను అధికారులు తనిఖీ చేసినట్లుగా పేర్కొన్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు అభ్యర్థులు దిగుమతిచేసుకునే తాయిలాల వివరాలపై 9154970445 వాట్సాప్ నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

చీరలు సీజ్

విశాలాంధ్ర-సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలో పారిశ్రామిక వాడ గోడౌన్‌లో రహస్యంగా దాచి ఉంచిన చీరలను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. సత్తెనపల్లి పట్టణం పారిశ్రామిక వాడలోని గోడౌన్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బాక్స్ మీద సీఎం జగన్ బొమ్మతో ఉన్న 5 వేలకు పైగా చీరలను అధికారులు సీజ్ చేశారు. ముందస్తు సమాచారంతోనే తనిఖీలు నిర్వహించామని వారు తెలిపారు. ఈ చీరలను పంపిణీ చేసేందుకు నిల్వ చేశారని సమాచారం అందడంతో తనిఖీలు చేసినట్లు వివరించారు.

గాదె వెంకటేశ్వరరావు పై చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తున్నాం..!

విశాలాంధ్ర - వినుకొండ : సత్తెనపల్లి జనసేన పార్టీ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పై, చేసిన అసత్య, అనుచిత ఆరోపణలను వినుకొండ జనసేన పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలియజేసిన పట్టణ జనసేన పార్టీ ముఖ్య నాయకులు. స్థానిక వెల్లటూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2014 లో పార్టీ స్థాపించిన నాటినుండి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు విశేష కృషి చేసిన వ్యక్తి, 17 నియోజకవర్గాలలో కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన అర్ధరాత్రి కూడా స్పందించే వ్యక్తి, ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటనలు చేస్తూ కమిటీలు వేస్తూ నిరంతరం పార్టీ బలోపేతం కోసం ఆలోచించే వ్యక్తి గాదె వెంకటేశ్వరరావు అటువంటి నిస్వార్థ నాయకుడి మీద పార్టీలోని కొంత మంది వ్యక్తులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం చేసే అసత్య ఆరోపణ లుగా భావిస్తున్నాం. పార్టీ ప్రతిష్ట దెబ్బతినే విధంగా ఎవరైనా బహిరంగ వ్యాఖ్యలు చేస్తే వారికి అదే రీతిలో సరైన సమాధానం చెప్తామన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

విశాలాంధ్ర-పెదకూరపాడు : పలు పార్టీల్లో కీలకంగా వ్యవహరించిన మండల పరిధిలోని 75 తాళ్లూరు ఎస్సీ కాలనీకి చెందిన వేమవరపు విద్యాసాగర్, ఇనుముక్కల ముత్యాలు, రేపూడి పాపయ్య(విశ్రాంత ఎల్ఐసీ ఉద్యోగి), తాళ్లూరి సాగర్, బంకా ప్రభుదాస్‌లు బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో 75 తాళ్లూరు గ్రామ ముఖ్య నాయకులు జంగాల వరప్రసాద్, జంగాల బాబు, రావులపాటి అనిల్, జంగాల కమలేష్ ఆధ్వర్యంలో పసుపు కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకాలు పెచ్చుమీరిపోయాయని, ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేది కూటమి ప్రభుత్వమేనని అందరి లెక్కలు తేలుస్తామన్నారు. పార్టీ పరంగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.